ఆహ్వానిద్దాం. లక్షణంగానూ, సరసంగా కూడాను వుంటుంది అన్నార్రావాళ్లు.

గంగాధరంగారు కించపడ్డారనుకో. అయినా అటు వంటి వాటికి జంకే మనిషి కాదుగా. అందుకని "జంట కవుల్ని పిలిస్తే ఇద్దరికీ కూడా గండపెండేరం వెయ్యాల్సొస్తుంది. ఖర్చు తట్టుకోవడం కష్టమవుతుంది కదండీ" అని ముక్తాయించిచ్చారు.

"పోనీ ఓ పని చేద్దామేమిటండి. చిలకమర్తివారినో, లేకపోతే శ్రీపాదవారినో ఆహ్వానిద్దామేమిటి" అంటూ తన్నో వేసార్రా ఆ సాహితీ మిత్రులు.

"బాగానే వుంటుందనుకోండి" అంటూ శ్రుతి సరిచేసుకుని, "అయినా పెద్దవాళ్ళని ఎవరైనా గౌర విస్తారు కదండీ. మనవాళ్ళని మనం గౌరవించుకుంటే బాగుంటుందనుకుంటాను" అని మేఘమల్హార్ రాగంలో పలికించారు వారు.

" గంగాధరంగారి భావం వాళ్ళ కర్థం కాలేదా అంటావా. అయిందిరా అబ్బాయ్. ఆ మాత్రపు ఇంగిత జ్ఞానం లేనివాళ్ళు కాదులే. ఆయన ధోరణికి, అమాయ కత్వానికి ఓ ప్రక్కన నవ్వు - మరో పక్క జాలీ కలిగాయిరా. కుర్రకారైతే ఒక ఆట పట్టిద్దామనే అను కున్నారు. పెద్దలు వారించడం వల్ల ఆగిపోయారులే.

గండపెండేరం వేయించుకోవాలనే కోరిక మటుకు గంగాధరంగారిని వదలలేదు.

భీమవరంలోనే లక్ష్మణశాస్త్రిగారని వుండేవారులే. వారు వైయాకరణులు, ఉభయ భాషా ప్రవీణులూను. భీమవరంలో జరిగే సాహితీ గోష్ఠులన్నీ వారి ఆశీర్వ చనంతోనే జరిగేవి. ఏ కవిశ్రేష్ఠుడికైనా, ఏ పండితుడి కైనా వారి ఆధ్వర్యంలోనే సన్మానం జరిగేది. కాశీ వరకు కూడా ఆయన కీర్తి వ్యాపించి వుందిరా అబ్బాయ్. అటు వంటి లక్ష్మణశాస్త్రిగారి చెవులకి గంగాధరంగారి గండపెండేరం వ్యవహారం సోకింది. 'గంగాపెండేరం గండధరంగారు' అని కుర్రకారు వ్యవహరించడమూ తెలిసింది.

భీమవరంలో వున్న సాహితీ బంధువుల్లో ముఖ్యుల్ని సమావేశపరిచారు శాస్త్రిగారు. 'మన గంగాధరం పాపం, చాలాకాలంగా సాహిత్యంలో కృషిచేస్తున్నాడ్రా. ప్రోత్సాహకరంగా అతనికి ఏదైనా చిన్న సన్మానం చేద్దా మని వుంది. ఏమంటారు?' అన్నార్రా అబ్బాయ్. కొంతసేపు ఎవరూ మాట్లాడలేదురా. ఆయన ఆంతర్యం తెలిసిన పెద్దలు కొందరు, తల పంకించ డంతో అందరూ అంగీకారసూచకంగా తలలూపారు.

గంగాధరంగారి సన్మాన సన్నాహాలు అట్టహాసంగా జరుగుతున్నాయి. లక్ష్మణశాస్త్రిగారు స్వయంగా సన్మానం చేస్తారన్న వార్త అంతటా తెలిసిపోయింది.

ఇహ గంగాధరంగారి సంగతంటావా! చెప్పేదే ముందిరా? ఐరావతాన్నెక్కి దేవేంద్రుడి బుజం తట్టి 'విశేషాలేమిటోయ్' అనడిగేంతట్టుగా వుంది. శాస్త్రి గారంటే గంగాధరంగారి భయభక్తులు చాలా వున్నాయి. 'ఇన్నాళ్ళకైనా తన కోరిక తీరుతోంది కదా' అన్న ఉత్సాహం ఆయన ముఖంలో ప్రస్ఫుటంగా వుంది. అంత ఉత్సాహంలోను గండపెండేరం విషయమూ, దానికయ్యే ఖర్చు విషయమూ ఎవరూ ఎత్తరేమిటబ్బా అనే ఆందోళన అంతర్లీనంగా వుండనూ వుంది.

మొత్తంమీద గంగాధరంగారి సన్మానసభ ఏర్పా టైంది. వేదికమీద గంగాధరంగారు, లక్ష్మణశాస్త్రిగారు, సభాధ్యక్షులైన సుబ్బారాయుడుగారు, మరి కొందరు పెద్దలు కూర్చుని వున్నారు. సభాస్థలి సాహిత్యాభి మానులతో నిండుగా వుంది.

సభాధ్యక్షులు లేచి నిలబడి 'మన గంగాధరంగారు, మన భీమవరంలో జరిగే ప్రతి సాహితీ సమావేశంలోను క్రమం తప్పకుండా పాల్గొంటూ వస్తున్నారు. మొక్క వోని పాటవంతో, పంచరత్నాలు మనకు వినిపిస్తూ వున్నారు. వారినీ విధంగా సత్కరించే భాగ్యం కలగడం మన సభకి గర్వకారణంగా వుంది. అందునా, పుంభావ సరస్వతులైన లక్ష్మణశాస్త్రిగారి చేతులమీదుగా ఈ వేడుక జరగడం మరీ ఆనందకరంగా వుంది" అంటూ ముగించారు.

వెంటనే వేద పండితులు ఆశీర్వచన పనసలు చది వారు. పిమ్మట లక్ష్మణశాస్త్రి లేచి నిలబడ్డారు.

'మా గంగాధరం అగ్రహారీకుడు. వారి పూర్వులు భారతికి ఎనలేని సేవలు చేసివున్నారు. ఆ వాసన ఈ చిరంజీవికి కూడా అబ్బింది. అనేక సభల్లో తన పంచ రత్నాలతో మనల్ని అలరించి వున్నవాడు. చక్కటి విగ్రహ పుష్టి కలవాడు. ఇతగాడు లేని సాహితీసభ, గంభీరమైన కంఠంతో చదివే పంచరత్నాలు వినిపించని సాహితీ సభ శోభించలేదు. ఇతగాడిని ఉచిత రీతిలో సత్కరించాలని మన వారందరూ అనుకోవడం జరి గింది. అది స్వయంగా చేసి, ఇతగాడిని రంజింపచేయా లనే అభిలాష నేను వ్యక్తీకరించడమూ జరిగింది.

కవిత్వమనేది దిరిసెన పువ్వు లాంటిది. లోహంలా కఠినమైనటువంటిది కాదు. అందువల్ల కుసుమాలలో మహారాజ్ఞి అయిన మల్లె సుమాలతో ఈ చిరంజీవిని సత్కరిస్తున్నాను. గండపెండేరముల వంటి బరువులతో ఇతగాడి సాహితీ ఔన్నత్యాన్ని దిగజార్చదలచుకోలేదు. అంతకన్నా విలువైనటువంటి 'పంచరత్న సార్వభౌమ' అనే బిరుదును ప్రదానం చేస్తున్నాను' అంటూ పొడుగ్గా, దట్టంగా కట్టిన మల్లెల మాలని గంగాధరంగారి మెడలో వేశార్రా అబ్బాయ్, శాస్త్రిగారు.

సభలో ఇతర ధ్వనులేవీ వినిపించకుండా కరతాళ ధ్వనులు చెలరేగాయి. బరువైన మల్లెమాల మెడ నలంక రించగా అవనత శిరస్కులయ్యారు గంగాధరం గారు.

'పంచరత్న సార్వభౌమ' అనే మకుటంతో గంగా ధరంగారి మీద పంచరత్నాలు చదివాడ్రా ఒక స్థానిక కవీశ్వరుడు.

అదిరా అబ్బాయ్. ఆ విధంగా గంగాధరంగారి సన్మాన సభ జయప్రదంగా జరిగింది. 'గండపెండేరం' అన్న ఆలోచన ఆయన మనసులోంచి మళ్ళీ బయటకు రాలేదురా."

---

కాలేజీ దాటని కథ

# ఆ మెంటల్ హెల్త్ వేరు

కాలేజీలో చదివే సుబ్బారావుకు ప్రతిరోజూ సిటీ బస్సులో కనబడ్డ అందమైన ఆడపిల్లల్ని పలకరించడం ఒక అలవాటు!!

ఎలాటి అమ్మాయినైనా ఏదో విధంగా పలకరించ డానికి ఎన్ని రకాల కుయుక్తులు వున్నాలో అన్ని రకాల కుయుక్తులు పన్ని, వాళ్ళను పలకరించేవాడు. అలా వాళ్ళను పలకరించి తనేదో ఘనకార్యం సాధించినట్టు మిత్రుల దగ్గర ఫోజులు కొట్టేవాడు.

ఇలా కొన్నేళ్ళు గడిచేప్పటికి సుబ్బారావు 'సైకాలజీ' అర్థమైన అమ్మాయిలు ఇతనికెలా బుద్ధి చెప్పాలా అని ఎదురు చూస్తున్నారు. చివరికి వారంతా కలసి ఓ కొత్త అమ్మాయికి, సుబ్బారావు పనిపట్టే కార్యక్రమం అప్పగించారు.



కొత్త అమ్మాయి బస్సులో కనిపించగానే సుబ్బారావు ఆ అమ్మాయి ప్రక్కనే చేరి, ఆ మాటా ఈ మాటా పలకరించి "మీది గుంటూరు కదండి!?" అన్నాడు.

"కాదు... మాది గుడివాడ!" అంది ఆ అమ్మాయి.

"మీ ఫాదర్ హెడ్‌మాస్టర్ కదా!?" అన్నాడు సుబ్బారావు

"మా ఫాదర్ పోస్ట్‌మాస్టర్!" అంది ఆ అమ్మాయి.

"అయితే మిమ్మల్ని చాలా సార్లు కలిసినట్టు గుర్తు! ఎక్కడో గుర్తురావడంలేదు!" అన్నాడు సుబ్బారావు.

అతను వాడిన మాటల్లో వ్యంగ్యానికి అతనికే పట్ట లేనంత ఆనందంగా వుంది!

అయితే ఆ అమ్మాయి "నేను మెంటల్ హాస్పటల్‌లో నర్సుగా పని చేస్తున్నాను! ఇప్పుడు మీ హెల్త్ — ఐ మీన్ 'మెంటల్ హెల్త్' ఎలా వుంది?" అంది.

బస్సులో జనమంతా ఘొల్లుమనడంతో సుబ్బా రావు బస్సు దిగక తప్పలేదు.

— ఎం.డి.సౌజన్య